క్లుప్తంగా

శనిత్రయోదశి పూజలు



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని మారుతి మందిర్‌లో శని త్రయోదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం శనివారం రోజున త్రయోదశి రావడంతో ఆలయ ప్రధానార్చకులు ప్రవీణ్ మహరాజ్ ఆధ్వర్యంలో గణపతి, హనుమాన్, నవగ్రహ విగ్రహాలకు, మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఎన్డీఎస్ఎల్ కార్మికుల వినతి



బోధన్‌టౌన్(బోధన్): ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను నిజాం దక్కన్ షుగర్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను మంత్రికి వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కేటీఆర్‌ను కలిసేందుకు తమకు సమయం ఇప్పించిన ఎమ్మెల్సీ కవితకు తాము కృతజ్ఞతలు తెలుపుతున్నామని కార్మికులు పేర్కొన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో కార్మిక సంఘం నాయకులు కుమారస్వామి, రవి శంకర్‌గౌడ్, ఉపేందర్, బాలకృష్ణ, దేవీదాస్, కార్మికులు తదితరులున్నారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తోపాటు అధికారులు, బీఎల్‌వోలు శనివారం ఇంటింటికి తురుగుతూ ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. పట్టణంలోని 38 వార్డులకు సంబంధించిన ఓటరు స్లిప్పులను ఇంటింటికి తిరిగి బీఎల్‌వోలు అందజేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

ఓటు అవగాహన ర్యాలీ



మాక్లూర్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రొగ్రాం అధికారి సరిత ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి మానిక్‌బండార్ వరకు నిర్వహించిన ర్యాలీలో 'ఓటు హక్కు – మన హక్కు' అంటూ నినాదాలుచేశారు. నోటుకు ఓటు వద్దని అది మన ఉనికికే ప్రమాదమంటూ పేర్కొన్నారు. మానిక్‌బండార్ తండాలో ఫ్లాష్ బాబు నృత్యం చేస్తూ పాటలుపాడుతూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, వైస్ ప్రిన్సిపల్ వాసవీలత, పద్మ, సునీత, అనిత, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను పూర్తి చేయాలి



మాక్లూర్: ఉన్నత విద్యను క్రమశిక్షణతో పూర్తి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ హారతి అన్నారు. మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి హారతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈవో అమృతలత, డైరెక్టర్ రమాదేవి, ప్రిన్సిపల్ గణేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

27న జేపీ నడ్డా రాక



బోధన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్‌కు ఈ నెల 27న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం శక్కర్‌నగర్ ఎన్ఎస్ఎఫ్ మైదానంలో నిర్వహించనున్న బీజేపీ సకల జనుల సంకల్పవిజయ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు.

మరో పండరీపురం..

- యంచ విఠలేశ్వరాలయం
- భక్తుడి కోరిక మేరకు కొండపై నిలిచిన స్వామి
- కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు
- నేడు పూర్ణాహుతి.. రేపు జాతర



ఆలయంలో కొలువుదీరిన పాండురంగ విఠలేశ్వరుడు, రుక్మాబాయి.. కొండపై స్వామి పాదం

నవీపేట : గోదావరి తీరాన యంచ కొండపై ఉన్న విఠలేశ్వరుని క్షేత్రం మరో పండరీపురంగా వెలుగొందుతున్నది. నాలుగు శతాబ్దాల క్రితం ఈ ప్రాంతానికి చెందిన భక్తుడు ప్రతి ఏడాది కార్తీకమాసంలో మహారాష్ట్రలోని పండరీపూర్‌కు కాలినడక వెళ్లి స్వామిని దర్శించుకునేవారు. పండరీపూర్‌కు వెళ్లిన సదరు భక్తుడు తనకు వయస్సు మీదపడిందని, చేతకావడం లేదని స్వామిని ప్రార్థించగా, స్వామి ప్రత్యక్షమై కోరికచెప్పమని అడుగగా, తనవెంట రావాలని భక్తుడు పట్టుబట్టినట్లు చెబుతారు. భక్తుడి భక్తికి మెచ్చిన స్వామి ఆయన వెంట వచ్చేందుకు అంగీకరించి, వెనక్కి చూడొద్దని ఆజ్ఞాపించాడని, ఈ ప్రాంతానికి వచ్చి గోదావరి దాటుతున్న సమయంలో భక్తుడు వెనక్కి తిరిగి చూడడంతో స్వామి మాయమయ్యాడని భక్తులు చెబుతారు. స్వామి కొండపై కుడిపాదం మోపారని భక్తుల నమ్మకం. గర్భగుడి ముందు స్వామిపాదం దర్శనమిస్తుంది.

కార్తీక పౌర్ణమికి మూడు రాష్ట్రాల భక్తులు

ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి రోజున నిర్వహించే పూర్ణాహుతికి మన రాష్ట్రానికి చెందినవారితోపాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొండపైకి వెళ్లే మట్టిదారిని ఇటీవల రూ.50 లక్షలతో సీసీగా మార్చడంతో భక్తులకు మరింత సులువుగా మారింది.

సిర్నాపల్లి దొరసాని హయాంలో ఆలయ నిర్మాణం

మూడు శతాబ్దాల క్రితం ఇక్కడి రాజ్యాన్ని పాలిస్తున్న సిర్నాపల్లి దొరసాని పాండురంగ విఠలేశ్వరునికి పవిత్ర భక్తురాలు. స్వామి పాదం మోపిన కొండపై అపురూపమైన రాతి గుడిని కట్టించారు. విఠలేశ్వరస్వామితోపాటు రుక్మాబాయికి గర్భగుడి వెనుకాల(పండరీపూర్ మాదిరి) ఆలయం కట్టించారు. ఆలయం నుంచి గ్రామంలోని కేదారీశ్వరాలయం(స్పటికలింగం), గోదావరి నది ఒడ్డుకు సొరంగ మార్గాన్ని నిర్మించారు. వేదబ్రాహ్మణులు పవిత్ర గోదావరి జలాలతో ప్రతిరోజూ స్వామివారికి అభిషేకం చేసేవారు.

సోమవారం పౌర్ణమి జాతర



ఈ ఏడాది పూర్ణాహుతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. సోమవారం రోజున కార్తీక పౌర్ణమి జాతరను నిర్వహిస్తాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. మధ్యాహ్నం నుంచి అన్నదానం ప్రారంభిస్తాం.

– రాజేశ్వర్, యంచ, గ్రామపెద్ద

రాష్ట్రానికి మంత్రినైనా వేల్పూర్‌కు బిడ్డనే

- నా కన్న ఊరు మద్దతే కొండంత బలం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



హాజరైన వేల్పూర్ గ్రామ ప్రజలు

వేల్పూర్: ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు.. తాను రాష్ట్రానికి మంత్రినైనా వేల్పూర్‌కు బిడ్డనేనని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి ప్రశాంత్‌రెడ్డి మోతె, వేల్పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు మోతె, వేల్పూర్ గ్రామాలు ఎంతో ఇష్టమన్నారు. వేల్పూర్‌లో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వేల్పూర్ చుట్టూ వాగులపై చెక్‌డ్యాములు, గ్రామంలో సెంట్రల్ లైటింగ్, గల్లీల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వేల్పూర్ నుంచి నలువైపులా వెళ్లే డబుల్‌రోడ్లు, బడులు, గుడులతో వేల్పూర్ సర్వతోముఖాభివృద్ధి చెందిందన్నారు. వేల్పూర్ గ్రామం మద్దతు తనకు కొండంత బలమని, మోతె గ్రామం తెలంగాణకు వేగుచుక్క అని అన్నారు. మంత్రిగా జిల్లాకు ఎప్పుడు వచ్చినా తాను వేల్పూర్‌లోనే బస చేస్తానని అన్నారు. సెక్యూరిటీ సమస్య ఉంటుందని అధికారులు చెప్పినా, తన గ్రామమే తనకు సెక్యూరిటీ అని చెప్పేవాడినని పేర్కొన్నారు. ఇరవై రెండేళ్లక్రితం టీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలో మోతె గ్రామం ఏకగ్రీవ తీర్మాణం చేసి ఉద్యమ దిక్సూచిగా నిలిచిందన్నారు. ఇరవై రెండేళ్ల నాటి ఉత్సాహం, ఆ పౌరుషం తన ప్రచారం సందర్భంగా కనిపించడం సంతోషంగా ఉందన్నారు. సాగునీటి కష్టాలు పడ్డ మోతె గ్రామానికి చెక్‌డ్యాములు, మాటుకాలువ నిర్మించి సాగునీటి సమస్యను పరిష్కరించామని, రూ.కోటితో జీపీభవనం, ప్రత్యేకంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పీఏసీఎస్ ఏర్పాటు చేశామన్నారు. మోతె, వేల్పూర్ గ్రామాల్లో మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మది హుందా రాజకీయం

- ఎంపీ అర్వింద్



అభివాదం చేస్తున్న అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్ : హుందా రాజకీయాలు చేసే బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ అర్వింద్ కోరారు. అన్నపూర్ణమ్మకు మద్దతుగా భీమ్‌గల్ పట్టణంలో అర్వింద్ శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి ప్రశాంత్‌రెడ్డి అవినీతి చిట్టాను బయటపెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఊసరవెల్లి రంగులు మార్చినంత ఈజీగా నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు పార్టీలు మారుతున్నారని, అలా పూటకోపార్టీ మార్చే వారు వారి స్వార్థ ప్రయోజనాలు చూస్తారే తప్ప ప్రజలకు సేవ చేయరని అన్నారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నియోజకవర్గంలో బీజేపీని గెలిపిస్తే గంజాయిని రూపుమాపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో బీజేపీని గెలిపిస్తే అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, పిల్లోల్ల గంగస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



రుద్రూర్‌లో ప్రచారం చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోడలు సోనిరెడ్డి



ఆర్మూర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

సాక్షి నెట్‌వర్క్ : పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం జోరందుకుంది. ఆయా పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఆయన కోడలు సోనిరెడ్డి, అరుణారెడ్డి రుద్రూర్, కోటగిరిలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత ప్రచారం చేశారు. నవీపేట మండలం ఫతేనగర్‌లో బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీత్‌రెడ్డికి మద్దతుగా ముప్కాల్ మండల కేంద్రంలో ఆయన సతీమణి దీప్తి ప్రచారం చేశారు. రెంజల్‌మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

పోచారానికి మద్దతుగా తీర్మానం



పోచారం సురేందర్‌రెడ్డికి తీర్మానప్రతిని అందజేస్తున్న ఖురేషీలు

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన ఖురేషి కమిటీ సభ్యులు ఇమ్రాన్, గూడుసాబ్ ఆధ్వర్యంలో ఖురేషీలు తమ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మానప్రతిని అందజేశారు. జెడ్పీటీసీ నారోజి గంగారాం, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, ఎస్ బాల్‌రాజ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, డైరెక్టర్ సుభాని, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, రైతు సమితి అధ్యక్షుడు తోట సంగయ్య పాల్గొన్నారు.

బీజేపీకే మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నందిపేటలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ.. పక్కన బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్ (ఆర్మూర్): బీసీలకు రాజ్యాధికారం కట్టబెడతామన్న బీజేపీకి మాదిగలు మద్దతు తెలిపి ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. నందిపేట్ మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన మాదిగల విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకాగా, బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్నారని, అందుకే ఉన్నత స్థాయి కమిటీ వేశారని అన్నారు. అణగారిన వర్గాలకు పెద్ద పీట వేస్తున్నారని బీజేపీకి మద్దతు తెలుపాలని, బీసీని సీఎం చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. దళిత సీఎం అంటూ మోసం చేసిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపులో మాదిగల మద్దతు ఎక్కువగా ఉండాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఎస్సీ వర్గీకరణ కల ప్రధాని మోదీ హామీతో నెరవేరనున్నదన్నారు. ప్రధాని తనకు సోదరుడితో సమానమన్నారు. దళితులను బీఆర్ఎస్, కాంగ్రెస్ చిన్న చూపు చూశాయని, బీజేపీ మాత్రమే దళితులను గౌరవించింది అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని రాకేశ్‌రెడ్డి గెలుపు ఆర్మూర్‌కి అవసరమన్నారు. నో బీఆర్ఎస్, నో కాంగ్రెస్.. ఓన్లీ బీజేపీ అంటూ నినాదాలు చేశారు. బీసీలు రాజ్యాధికారం కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బంగారు శృతి, మైలారం బాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పోశెట్టి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. గెలిపించాలని కోరుతున్నా



బోర్గాం(కె)లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డితో మాక్లూర్‌కు చెందిన మైనారిటీలు

మాక్లూర్: రెండుసార్లు తనను గెలిపించినందుకు ఎంతో అభివృద్ధి చేశానని, మూడోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాణిక్‌బండార్‌తండా, బోర్గాం(కె), కృష్ణానగర్, సింగంపల్లితండా, మెట్టు, ఆర్టీసీకాలనీ, మాదాపూర్, కల్లెడి గ్రామాల్లో జీవన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మొద్దన్నారు. గత పాలకులు ప్రజలు కనీస అవసరాలు తీర్చలేదని, కరెంటు కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అప్పటి పరిస్థితి ఎప్పటికీ మర్చిపోమని, ప్రజలు అయోమయానికి లోనుకాకుండా ఈనెల 30న కారు గుర్తుకు ఓటువేయాలని ప్రజలను కోరారు. ఆయా గ్రామాల ప్రజలు జీవన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ రాయ్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగంటి శ్రీనివాస్ గౌడ్, బడుగు సత్యం, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఆకుల రజినీష్, సుక్కి సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే మైనారిటీల మద్దతు

ఎవరు ఎన్ని మాటలు చెప్పినా తమ మద్దతు జీవన్‌రెడ్డికేనని మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మైనారిటీ అన్నారు. ఈ మేరకు శనివారం జీవన్‌రెడ్డిని కలిసి తమ మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ మైనారిటీల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని, షాదీముబారక్ వంటి పథకాల ద్వారా ఎంతో మంది లబ్ధిపొందారన్నారు. జీవన్‌రెడ్డిని కలిసిన వారిలో కరీం, కోకా హైమద్, తాజొద్దీన్ ఉన్నారు.

గ్యారంటీ చట్టం తీసుకురావాలి



విలేకరులతో మాట్లాడుతున్న గంగాధర్

ఎడపల్లి(బోధన్): రైతులకు గ్యారంటీ చట్టం తీసుకురావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సహకారసంఘంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకూ రూ.5000 పింఛన్ ఇవ్వాలన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలన్నారు. ఎరువుల ధరలను తగ్గించాలని కోరారు. మల్లేశ్, హన్మాండ్లు, సుదర్శన్, నారాయణ, కే రవి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

సిరికొండ: ఇటీవల చెన్నైలో ఇండియన్ నేషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సిరికొండ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థి అనుదీప్‌గౌడ్ పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించాడని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

కేజీబీవీలో మాక్ పోలింగ్

మోపాల్: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు, ఓటు వేసే విధానం, ఓటు ప్రాముఖ్యత, తదితర అంశాలపై ఎస్‌వో శ్రీవేణి వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను కాపాడుకుందాం

- బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్



కుర్నాపల్లిలో మాట్లాడుతున్న షకీల్ ఆమేర్

ఎడపల్లి(బోధన్): కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాపాడుకుందామని బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ఆమేర్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మంగళ్‌పాడ్, కుర్నాపల్లి, ఠాణాకలాన్, బాపునగర్ గ్రామాల్లో షకీల్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో షకీల్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. 70 సంవత్సరాల్లో కాంగ్రెస్ చేయని అభివృద్ధిని తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. నెత్తి మీద కూర్చునే వారు కావాలా? గుండెల్లో పెట్టి చూసుకునే వారుకావాల? ఆలోచించాలని ప్రజలకు సూచించారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజితయాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచులు ఆకుల మాధవి, హన్మాండ్లు, సావిత్రి, రవీందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, రవి, ఎంపీటీసీలు రాంరెడ్డి, బాబా పోతన్న, బిల్ల సుమలత, అనిల్, నాయకులు పరిగె సుమన్, సురేశ్, హుండీ నాగేందర్, సాయిలు, యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకున్న ఆర్‌వో



సిబ్బందితో రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రా

భీమ్‌గల్ : బాల్కొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వంద శాతం ఓటింగ్ లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, ఈనెల 30వ తేదీన ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు స్వచ్ఛందంగా వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10
స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20
స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00
స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
ఫర్‌హూమ్ (తెలుగు) 9.45

దినకర్ మహారాజ్ పాదుకల ప్రతిష్ఠాపన

నిజామాబాద్ సిటీ: సారంగపూర్ హనుమాన్ మందిరంలో శనివారం బడా రాం మందిర్ మఠల్ ఉత్తర అధికారి స్వర్గీయ దినాకర్ మహారాజ్ వస్త్రాల సమాధి, మహారాజ్ పాదుకల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. బడా రాంమందిర్ మఠం, సారంగపూర్ హనుమాన్ మఠం ట్రస్ట్, పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కుర్ర జితేందర్ బాబు, బినోల పంతులు శాస్త్రి, శశి మహరాజ్, రొట్టె రఘునాథ్ శర్మ, రమేష్ సింగ్ చౌహన్, హిమబిందు, సామినేని రమేశ్, ప్రకాశ్‌రావు, దేశముఖ్, అంబదాస్, రవి, దిగంబర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.